అత్తగారి అధికారము

శ్రీమతి కోటమర్తి రాజేశ్వరమ్మగారు

౧

రంగము - రాజమ్మగారి గృహము

[ప్రవేశము- రాజమ్మ, జోగమ్మ, హనుమాయమ్మ]

రా:—రండి; తలుచుకుంటూ ఉండగానే వచ్చేరు. ఏమిటి విశేషాలు? జోగమ్మక్కయ్యా!

జో:—ఏమున్నాయి? కలికాలం వచ్చింది. ఆడవాళ్లు చదువులవల్ల బొత్తిగా పాడైపోతున్నారు. పెద్దలయెడ భయభక్తులు లేకుండా వున్నారు. నేను మొన్న రాజారావుగారింటికి వెళ్లేను. ఆయన కొడుకు కోడలికి యింగ్లీషు చెప్తూ యున్నాడు. నాకు సర్వ అసహ్యమూ వేసింది. సిగ్గు బిడియములు లేకుండా- పట్టపగలు మాటలేకాకుండా- చదువులుకూడాను.

హ:—అవునమ్మా ఆ చదువే కొంపముంచుతోంది. మనయింటిప్రక్కనున్న సుందరరావుగారి కుమార్తెకి మొగుడు పోయాడు. అప్పటినుంచి బళ్లోకివెళ్లి చదువుకుంటోంది. పెళ్లి కూడా చేస్తారట.

రా:—వీళ్ల చదువులు మాసిపోనూ. రామరామ. ఇల్లాంటి విరుద్ధాలు జరుగుతూవుంటే మనబోటి వాళ్లంతా చచ్చిపోవలసిందే.

జో:—ఎందుకో యీ చదువులు? ఆడవాళ్లు చదువుకుని ఉద్యోగాలు చేస్తారా? ఊళ్లేలుతారా? చదువురాకపోతే మనబోటివాళ్లని మన మొగుళ్లు విడిచిపెట్టేరాయేమిటి, చెప్పమతీ? ఇందుకనే మాఅమ్మాయి యెన్నోసార్లు బళ్లోకి వెడతానన్నా నేను వప్పుకోలేదు.

హ:—మా కోడల్ని వాళ్ల వూళ్లో బళ్లోకి పంపేరని తెలిసింది. బళ్లోకి పంపితే వీలులేదని కఠినంగా కబురుపంపేను. ఇక్కడకివచ్చిన తర్వాతకూడా, షోకులు పనికిరావని చెప్పి కచ్చాపోసి చీరకట్టిస్తున్నాను. వాల్జడ గీల్జడ; పక్కపాపిడి గిక్కపాపిడి అన్నీకట్టిపెట్టించేను. చదువుకోలేదుగనుక చెప్పినట్లువిని చచ్చినట్లు పడివుంది.

రా:—నీవు అదృష్టవంతురాలవు. నీకోడలువింది. నాకోడలు వినదు. పక్కపాపిట మానమని వేయివిధాల చెప్పేను. నాకొడుకే వొప్పుకోడు. ఏమిపాపిడైతేఏమి అంటాడు. వేగలేక చచ్చిపోతున్నాను.

హ:—ఇవి ఎక్కడి షోకులమ్మా? మా కాలంలో నిక్షేపంగా పచ్చగా పసుపు పూసుకొని, యెఱ్ఱగా బొట్టుపెట్టుకొని యెంతో అందముగా ఉండేవాళ్లము. ఇప్పుడు మొగాన్ని యింత బూడిదెలాగ యేదోపూసుకుంటారు. అది అందము కాబోలు! మా కోడలుమాత్రము వింటుందనుకొంటున్నావా? నా నోటికి జడిసి పూరుకుంటోంది, అస్తమానూ అరుస్తూ అన్నీ చెబుతూవుంటాను.

జో:—వదినా! రేపు మళ్లీ వద్దాము. పనివేళ అయింది. ఇంటికి వెడదాము.

[రాజమ్మగారి కోడలు కమల ప్రవేశం]

క:—వంట, అత్తా! ఏమిచెయ్యవలెను?

రా:—యేం చేశేదా? నీశార్ధంచెయ్యి. ఎవరేనా ఇంటికివస్తే మాట్లాడనిస్తావా, లేదా? చేస్తున్నావే మాయివంట. గొప్ప గొరిగిపోతోంది. నన్ను అడగాలికాబోలు! నీకు తోచినది చెయ్యి.

క:—నిన్న అడగలేదని కోపముపడిరని ఇప్పుడు అడిగితిని. అత్తా! కోపమువస్తుందని తెలిస్తే అడగను.

రా:—అయ్యో! అయ్యో! దానికి ఏమి సమాధానము చెప్పనమ్మా? ఆవిడకుచదువచ్చును. నన్నే ఎత్తిపోస్తోంది, వింటున్నారా? నాకు చావుపెట్టడమ్మా దేవుడు. దానితో చదువురాని ఎధవను నేను మాట్లాడగలనా?

క:—(తెల్లబోవును.)

—జోగమ్మ, హనుమాయమ్మ నిష్క్రమింతురు.

రా:—మొద్దురాచ్చిప్పలాగ చూస్తావేమి? నీతో నేను వేగలేకుండా ఉన్నాను. మొగాళ్లు భయం చెప్పడంలేకపోతే యిల్లాగేఉంటారు.

క:—(ఊరుకొనును.)

రా:—సోదెమ్మ కూతుర్ని చేసుకోమని కాళ్లుపట్టుకొని బ్రతిమాలితే వప్పుకోక నాకొడుకు నిన్ను చేసుకొన్నాడు, నీవు మమ్మల్ని వుద్ధరిస్తున్నావు. ఏడాదైంది కాపురానికివచ్చి. ఒక్కపిల్లవాడైనా పుట్టలేదు. సోకుమాత్రం కావలసినంతవుంది. పాపిడమానమని చెప్పరా అంటె అసలేచెప్పడు. పోనీ వాడికర్మం. ఈవంకాయ వక్కటి కూరవండు, ఈ అర్ధసేరు బియ్యమువండి తగలెయ్యి, నాకు రొట్టెకాల్చు.

క:—ఈఒక్క వంకాయకూర సరిపోతుందా?

రా:—సరిపోకపోతే నీవు మేసుకోకు. పొయ్యిలో కట్టెలుపెట్టినావు. సంసారివికాదూ? రెండుకట్టెలు తీసివెయ్యి. నీకు చెప్పలేక చచ్చిపోతున్నాను. ఇంతకీ నాకర్మము.

క:—(తనలో) ఎవ్వరో వస్తారటకూడాను. ఈవక్క వంకాయ వండిపెట్టాలి కాబోలు. ఉవ్.

౨

[మాధవరావుగారికి కమల వక్కర్తె కూతురు. కమల ఎప్పుడును మాటపడియెరుగదు. చక్కనిచుక్క. అతిగారాబముతో పెరిగినది. సంగీతము, కుట్టుపని, చదువు నేర్చుకొన్నది. గృహకృత్యములు చక్కగా చేయగలదు. కమల అత్తవారియింట తెల్లవారినదిమొదలు నిదురబోవువరకు సమస్తపనులు తానేచేసి, వంటకూడ తానే చేయును. అయినను అత్తగారగు రాజమ్మ యేదియో నేరం కల్పించి పోట్లాడుచుండును. కమల భర్తపేరు ఆనందరావు. ఆనందరావు తల్లిస్వభావము పూర్తిగా ఎరుగును. కాని తల్లికి ఎదురుమాట్లాడలేడు. భయస్థుడు. కమలని యేకాంతముగా వోదారుస్తాడు. రాజమ్మకు కోడలన్న అసహ్యము. కనుకనే యేదియో నేరంకల్పించి పోట్లాడుతూనేయుండును. కమలకి నెలతప్పినది. ఆమె దేహారోగ్యము సరిలేనందున ఆమెతండ్రి యెన్నిసార్లోవచ్చి అడిగినాడు కూతుర్ని పంపమని. రాజమ్మ పంపలేదు. కమలకి జ్వరముకూడ వస్తోంది. జోగమ్మ చూచుటకువచ్చినది.]

జో:—ఏమో, రాజమ్మవదినా! నీకు మనమడు పుడుతాడు కాబోలు, చెప్పకూడదేమిటి?

రా:—అన్నీ బాగానే ఉన్నాయి. కొడుకుచేస్తున్నాడు, ఇంక మనుమడుపుట్టి వుద్ధరిస్తాడు.

జో:—కోడలు లేచుటలేదు కాబోలు.

రా:—దొంగరోగాలమ్మా! మేము పిల్లల్నికనలేదా? పెంచలేదా? ఇదేమి సోద్యాలమ్మా! వికారాలట! డోకులట! అన్నం సహించదట! యేమోనమ్మా, మేమెన్నడు యెరగము.

జో:—వంటపని నీకేకాబోలు. ఏమిచేశావు?

రా:—నేను చెయ్యలేనమ్మా! అదేచేస్తోంది. నాకోసం చేస్తారేమిటి? చచ్చినట్లు చేసుకొంటారు. అదదానికి పడుకుంటే ఎట్లాజరుగుతుంది?

జో:—అవునమ్మా. పొద్దుపోయినది. వెళ్లివస్తాను.

—నిష్క్రమించును

* * * * *

[కమలని పంపమని తండ్రి మళ్లీ వచ్చేడు. రాజమ్మ ఎన్ని చెప్పినా వినలేదు. చివరకు తల్లిమాట అతిక్రమించి ఆనందరావు పురిటికి కమలను పంపివేసినాడు. కొద్దిరోజులలో కమలకు పుత్రుడు పుట్టేడు. శుభలేఖ వచ్చింది. తెలియగానే హనుమాయమ్మ వచ్చింది.]

హ:—యేమో, వదినా! మనమడు పుట్టేడటకదూ? చెప్పనేలేదు. అదృష్టవంతురాలవు అయితే భారసాలచేసుకొని వెంటనే కోడల్ని తీసుకొనివస్తారేమిటి?

రా:—యేమోనమ్మా! నాకు తెలియదమ్మా! తీసుకువస్తాడో, గంగలో దింపుకుంటాడో, నాకెందుకు? నే చెప్పినట్లు చేస్తాడేమిటి?

హ:—వదినా! వెళ్లివస్తా!

—నిష్క్రమించును.

[ఆనందరావు ఉత్తరం పట్టుకొని ప్రవేశం]

ఆ:—అమ్మా! నామకరణమహోత్సవమునకు రమ్మని మామగారు ఉత్తరము వ్రాసినారు. ప్రయాణమై సిద్ధముగా ఉండు.

రా:—బాగానేఉంది. నాయనా! నీవు వెళ్లిరా, నేనుకూడ ఎందుకు, బోడిముండని.

ఆ:—అదేమిటమ్మా! అట్లా అంటావు? పెద్దదానవు నీవువుండి నామకరణము వ్రాయించి కోడలిని తీసుకొనివస్తే బాగుంటుంది.

రా:—నా పెద్దతనము మండిపోయినట్లేఉంది. అన్నిటిలోను పెద్దగానే చూపించు. ఇంకేమిలోటు? అబ్బాయీ! ఎందుకొచ్చినగోలా? దానిని తీసుకొనివస్తే నేనువుండను. అదేనా వుండాలి నేనేనా వుండాలి.

ఆ:—అమ్మా! అట్లనకూడదు. చేసుకొన్నతరువాత కష్టమో నిష్టూరమో తప్పుతుందా? అదివుంటే నేను ఉండనంటే తప్పుకదూ, మతి?

రా:—నాయనా! అవును నామాట తప్పుగానే ఉంటుంది. పెళ్లాం బెల్లం, తల్లి దెయ్యం అని నాకు తెలుసును, నాయనా! నాతల్లిమాటప్రకారం నడవమని చెప్పలేకపోయావు? పైగా దానికి ఎదురువుత్తరము ఇస్తున్నావు. ఇంకేమి కావాలి? నాయనా! ఇతకే పెద్దముండని బ్రతికిఉండడము తప్పు.

ఆ:—అమ్మా! అవిఅన్ని ఇప్పుడు ఎందుకు? నీవువస్తావా, రావా?

రా:—నేను రాను.

ఆ:—నేనువెళ్లి తీసుకొనివస్తాను.

—నిష్క్రమించును.

3

[రాజమ్మ, కమల ప్రవేశం]

రా:—కమలా! ఏమిచేస్తున్నావు?

క:–కాఫీచేస్తున్నాను. వస్తున్నా.

రా:—నీ కాఫీ తగలపెట్టా. ఎప్పుడుపోతుందో కాని. చెవులో చెట్లుమొలిచేయా యేమిటి? పిల్లాడు ఏడుస్తున్నాడు. వినిపించడం లేదూ?

క:—ఇప్పుడే పాలుపట్టి పరుండపెట్టేను. మీఅబ్బాయి తొందరగా కాఫీకావలంటే వెళ్లేను.

రా:—అబ్బాయిదిపేరు, నీదినోరు. నేనెరుగుదును నీటక్కులు. నీవు పిల్లవానికి పాలు ఇయ్యవు. ఇస్తావుంటే సించాలకొద్ది పూసుతాయి. అంతాషోకులు. బలంపోతుందని పాలుఇయ్యవు. మా కాలంలో పోతపాలు లేవు.

క:—పాలుచాలకపోతే పోతపాలుపోయక ఏమిచేస్తారు?

రా:—అవునే, తెచ్చేమొగుడు ఉన్నాడుకదూ, నీకేం గ్లాసుడుపాలు కలుపుతావు. వద్దంటె కడుపు నిండావద్దా అంటావు. అయినా నాకెందుకు, యీవేళవుండి రేపు చచ్చేదానికి.

[ఆనందరావు ప్రవేశం]

ఆ:—అమ్మా! ఎవరో వాకిటిలోనికి వచ్చారు. కాసేపు వూరుకో.

రా:—వూరుకోక ఏమిచేస్తాను. కాస్తమూకలెయ్యవు. లోకులకైనా వెరవాలి. ఆ వరస కోడై కూస్తుంటె, అమ్మా! వూరుకోఅంటావా; సిగ్గువిడియంలేక? ఎవరోవస్తే నాకేమిభయం? నామీద సామంతము చేస్తావా? పెళ్లాముకి దాసుడవై పోయావు. ఏమందోపెట్టింది. లేకపోతే ఇంతహద్దుమీరవు. మాయిపెళ్లాము వచ్చింది. చక్కనిచుక్కంటిపిల్లని విడిచి ఈ దరిద్రప్పిల్లని చేసుకొన్నావు...... ఇటువంటివాళ్లకి, అణిచే అత్త, మణిచే మామ, వద్దించే మొగుడు వుండాలి. అప్పుడు లొంగుతారు. నన్నేడిపించుకొని తింటున్నారు. నేడుస్తున్నాను. మొద్దులాగ ఎన్నిఅన్నా సమాధానంచెప్పదు.

ఆ:—కమలా! నీవు అవతలకు వెళ్లు.

క:—(వెళ్లును.)

రా:—పేరుపెట్టిపిలుస్తేకాని పెళ్లామని అందరికి తెలియదుకాబోలు. అంతానవ్వుతారని సిగ్గేనాలేదు. మొండిబ్రతుకు. తీసుకురావద్దంటె వెళ్లి తీసుకొచ్చావు. నన్ను ఏడిపిస్తోంది.

—ఆనందరావు నిష్క్రమించును.

౪

[ఆనందరావు మోహనుని యెత్తుకొని 'పిల్లాడు ఏడుస్తున్నాడు. తీసుకో' అని కమలకిచ్చును. కమల తీసుకొనును. ఇంటిలోఉన్న రాజమ్మ వచ్చును.]

రా:—ఇదేమిపోద్యాలమ్మా! కాస్త పిల్లవాడిని కిక్కురుమననీయవు. పిల్లలుఏడిస్తే ఎంతోబలం, మీకు జరుగుతోందిగాని, మా కాలంలో సమస్తం గదిలోపెట్టుకొని మంచంవేసుకొనేవాళ్లం. పురిటినీళ్లు పోసుకోగానే సమస్తపనులు చేసుకొనేవాళ్లం. ఈరాణీవాసాలు, ఈషోకులు మాకు వుండేవికావు. అంటేకోపంవస్తుంది కాని అంతచిన్నబొట్టుపెట్టుకొన్నావు యేమిటి? చక్కగా పేడకాసంత బొట్టుపెట్టుకోవాలి. బిడ్డ తల్లివికూడా అయావు. ఇంక వెఱ్ఱిషోకులుకట్టిపెట్టి సంసారివలెఉండు. ఒక్కటీ సంసారిచేసేపని లేదు.

ఆ:—కమలా నిన్ను మీనాన్నగారు పంపమని జాబువ్రాశారు. రేపుప్రయాణం. సిద్ధంగాఉండు.

రా:—పుట్టింటికి పంపుతావా? నాయనా! అత్తగారిబాధలు పడలేకుండాఉంది. నేను చచ్చినతరువాత తెచ్చుకొందుగాని.

ఆ:—ఎందుకమ్మా! యీమాటలు. మళ్లీ పదిరోజులలోవస్తుంది.

—నిష్క్రమించును.

౫

[ఆయాసముతో బాధపడుచూ రాజమ్మ, ఆమెకోడలు కమల కళ్లుపత్తుచు ప్రవేశం]

రా:—తల్లీ! మాయింటికి నీవు మహాలక్ష్మివి. అమ్మా నేను నిన్ను పెట్టిన బాధలు నేనెట్లుమరువనమ్మా. అన్నిటికినోర్చి నన్నెదిరించిరైన మాటాడ లేదమ్మా! ఇంతమంచిదానవని తెలుసుకొనలేకపోతిని. నీవు లేకపోతే నాగతి ఏమగునోగదా? మాటలాడలేవమ్మా! నాకు రెంతో సంరక్షణచేయుచున్నావు. నీశరీరము బాగా లేదు కూడాను. రాత్రినిద్రలేనందున డోకులు వెళ్లుచున్నవి. తల్లీ! ఈసారి పుట్టబిడ్డను యీనిర్భాగ్యురాలు రెత్తుకొనుటకు నోచుకొనలేదు. ఇంకబ్రతకనమ్మా! (ఆయాసపడును.)

క:—అత్తా! మీరట్లెన్నడు తలచవద్దు. మీరునన్ను మఱి యేమిబాధలు పెట్టలేదు. నేను మీసంరక్షణ చేయుచుంటిని. మీకు జబ్బుతగ్గి నిమ్మదిగా ఉంటే అదేపదివేలు. డాక్టరు మాట్లాకవద్దన్నాడు. ఇదిగో డాక్టరుగారు మీ అబ్బాయిగారు వచ్చుచున్నారు.

[డాక్టరు, ఆనందరావు ప్రవేశం]

డా:—అమ్మా! ఎట్లున్నది?

రా:—నాయనా నిన్నటికంటె కొంచెము తగ్గినది. తిరుగుదునా? నాయనా!

డా:—అవ్వగారూ! మీకేమీ భయములేదు. తరచుమాట్లాడవద్దు. నేనుచేయుచున్న వైద్యముకంటె మీకోడలు చేయుచున్న ఉపచారమువల్ల త్వరగా నెమ్మదించగలదు. గంటకు ఒకసారి యీపొట్లము, మూడు గంటలకొకసారి యీఅరఖు పుచ్చుకొనుడు. తగ్గిపోవును. నేను వెళ్లెదను.

—నిష్క్రమించును.

౬

[రాజమ్మకు క్రమముగా ఆరోగ్యము కుదిరినది. ఆమెకు కోడలన్న అత్యంతప్రేమ కుదిరినది. కమలకు ఆడపిల్ల పుట్టినదని వినుటతోడనే ఆమె అపరిమితానందమును పొందినది. పుట్టినింటనుండి నెలలోపున కమలను బిడ్డలతో తీసికొని రావలెనని బుద్ధిపుట్టినది. వెంటనే తాను ఎన్నదినములనుండియో వంటయింటిలో పిడతలో పాతిపెట్టిన ఇరవైఅరు రూపాయిలను తీసికొనివెళ్లి మనుమరాలికిచ్చి వారిని పుట్టినింటినుండి తీసుకు వచ్చింది. ఇక యింటివద్దర రాజమ్మపని యేమన మోహనకను మనుమనితోను రాజేశ్వరి అను మనుమరాలి తోను వాళ్లఆటలుపాటలు చూకడం, ముద్దుపలుకులు వినడం, ఆనందించడం.]

మురళీగానము

శ్రీమతి పైడిమఱ్ఱి సీతాదేవిగారు

నిర్మలాంబరకాంతుల నినుమడించు
స్వచ్ఛతేజంబు కృష్ణుని స్వేచ్ఛగొలువ
ముద్దులముంగురుల్ ముఖమునునుతింప
కమలనయనములనుండి విమలనూత్న
కాంతులువి స్తరింప అనంతుడైన
వానినోట బ్రహ్మాండంబు వరలుచుండ;
మొలనుకట్టిన రతనాలుమెఱుపులీన

పాదపద్మంబులందున్న పైడిసగలు
బాల్యక్రీడలనాతడు బారునపుడు
సారెసారెకు ఘల్లున శబ్దమీయ;
మురళిచేబూని హాయిని మ్రోయునపుడు
గోవులమంద యీవిందు గ్రోలుచుండ
గాంచి సుఖనిద్రజెందెడి గాసలోల!
కరము వాయింపుమయ్య! నీమురళిమఱల.